

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 ఫిబ్రవరి, 2016 సంచిక : 9

**సంస్థాపకులు :**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | |
|---|---|
| ద్వైవార్షిక చందా.......... | రూ॥ 160/- |
| ఆజీవ సభ్యత్వం .......... | రూ॥ 800/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
మంగళాశీస్సులు ........ 4
మనిషి-మానవుడు ........ 5
భగవాన్ స్మృతులు ........ 6
జగద్గురు తత్త్వబోధకస్వామి ........ 7
జ్ఞానధామం ........ 10
శ్రీ గజానన విజయం ........ 11
షిరిడీ డైరీ........ 15
గురుదేవులతో కబుర్లు........ 17
నల్లి కథ ........ 19
గురువాణి-2........ 21
వినతి ........ 24
మాతృసంస్థ కబుర్లు ........ 25
శక్తి........ 27
మనకుందా?........ 29
వ్యాసాశ్రమ స్వామి వారితో........ 30







## మా వాణి



కాలచక్రం ఎవరికోసమూ ఆగదు. అలా.... పరిభ్రమిస్తూనే ఉంటుంది. 2016లో అప్పుడే ఒక నెల గడిచిపోయింది. సుఖదుఃఖాలూ అంతే- "చక్రవత్ పరివర్తంతే". ఒకసారి సుఖం పైకీ దుఃఖం క్రిందికీ వస్తే, మరోసారి దుఃఖం పైకీ సుఖం క్రిందికీ వస్తాయి. ఇది సృష్టివృత్తం. పుట్టిన ప్రతివారూ గిట్టక తప్పదు. అంటే కాలంలో కరిగిపోక తప్పదు. కానీ, కొందరం సజీవంగా ఉన్నప్పటికీ మృతులతో సమంగానే ఉంటారు. వారినే జీవచ్ఛవాలు అంటారు. మరికొందరు మృతిచెందినప్పటికీ వారి కీర్తి ప్రతిష్ఠలు నిలబడే ఉంటాయి. అంటే ప్రజాహృదయాలలో సజీవంగానే ఉన్నారన్నమాట! అందుకే వారిని అమరజీవులంటారు.

ఈ విశ్వమంతా ఓ పెద్ద నాటకరంగం. ఏదో కొన్నిరోజులు ఉండి అటుపై ఖాళీ చేయవలసిన సత్రం. ఎవరికి వాళ్లు వచ్చి పోయిగా అలా తిరిగేసి వెళ్లిపోయే సంత. ఈ రంగస్థలానికి సూత్రధారి భగవంతుడు. మనం కేవలం పాత్రధారులం మాత్రమే. ఆ విషయం ఎన్నోసార్లు వింటాం- కళ్లారా చూస్తాం. కానీ, మర్చిపోతాం. చనిపోవడాన్ని జరిగిపోవటం, కాలం చేయటం అనే మాటలు గొప్ప తాత్త్వక శబ్దాలు. (ఆయన తన పాత్ర పూర్తి కాగానే జగన్నాటక రంగస్థలం మీది నుంచీ ప్రక్కకు జరిగాడు. తన ఆయువున్నంతవరకు భూమిపై ఉండి కాలగర్భంలో ఒదిగిపోయాడు). చిన్న తేలిక మాటల్లో ఎంత గొప్ప సత్యాలను ముచ్చటగా, స్పష్టంగా చెప్పారు పెద్దలు! మనిషి వెళ్లిపోయేటపుడు "అయ్యో, ఇంకా అనుభవించకపోతినే సుఖాలు! నా వాళ్లు, నా యిల్లు-అన్నీ విడిచిపోతున్నానే!" అని ఏడుస్తూ వెళ్లకూడదు. 'నా కర్తవ్యం అయిపోయింది-వెళ్లిపోదాం' అన్న సహజభావంతో వెళ్లగలగాలి.

పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు ఎప్పుడూ చెప్తుండేవారు-"సాధకుడు శిశువులా ఉండాలి" అని. వటపత్ర శాయిని చూపించి 'అదుగో అలా తనలో తానే-తనతో తానే జీవితాన్నొక క్రీడగా సంతోషంగా గడపగలగాలి. ఆ నిత్యసంతుష్టుడిని బాహ్య విషయాలేవీ బాధించలేవు. అతని సహజానందాన్ని చెనకలేవు. చిన్నపిల్లలు నదీ తీరంలోని ఇసుకలో ఎంతో జాగ్రత్తగా, అందంగా గూళ్లు కట్టుకుంటారు. అక్కడ దొరికే గవ్వలూ, చిన్నిచిన్ని నత్తగుల్లలూ ఏరితెచ్చి ఆ పిచ్చుకగూళ్లను (ఇసుకగూళ్లను) అలంకరిస్తారు. ప్రక్కవాళ్లకంటె తాము కట్టినవే బాగుండాలని పోటీపడతారు. రకరకాల గవ్వలన్నీ ఏరి జేబులు నింపుకొంటారు. చీకటి పడుతుంది. అమ్మరమ్మంటుంది. ఈ గవ్వలన్నీ సముద్రంలోకి విసిరి పారేస్తారు. పిచ్చుకగూళ్లను కాళ్లతో తన్ని చెరిపేసి అమ్మ వెంట పరుగెడతారు. మనకన్నా వాళ్లెంత వివేకవంతులో చూడండి. చేయవలసినంత కాలం చేయవలసిన ప్రతి పనినీ అదే లోకమన్నంత శ్రద్ధగా చెయ్యాలి. నైపుణ్యం, ఏకాగ్రత చూపించాలి. కానీ, వేళ మించిందీ- ఏ మాత్రం విచారంగానీ, సంకోచంగానీ లేకుండా నిరుద్వేగంగా అన్నిటినీ వదిలేసి వెళ్లిపోగలగాలి. అలాకాక 'అయ్యో, నా వారు, నా సొత్తు' అనుకొనే వారు మూర్ఖులైపోతారు. భగవత్పాదాల మీద అభిరుచి కలిగిన సాధకుడు శిశువులాగే ఒక్క చిటికెలో అన్నీ తోసిపారేసి పరుగెత్తగలగాలి"-అని చెప్పేవారు.

'తామేది భావిస్తారో అదే పైకి చెప్పాలి-ఏది చెప్తారో అదే ఆచరించాలి. అట్టివారే-ఆ త్రికరణశుద్ధి చూపగలవారే సన్మాన్యులు, సద్గురువులూను" అంటారు పెద్దలు. అలాటి త్రికరణశుద్ధి చూపించి, నిరుద్వేగంగా, సాయి స్మరణ తప్ప మరొక్క పలుకు లేకుండా ధ్యానముద్రలోనే కూర్చొని తరలిపోయిన అస్మద్గురుదేవులకిదే పాదాభివందనం.

మరణం తనువుకు వచ్చే లోపలే మన లోపలి కోరికలకు, తపనలకు, అరిషడ్వనికీ మనం మృత్యుగీతం (చరమగీతం) పలికి, శ్రీసాయి పాదాలపై నిశ్చలభక్తిని నిలుపుకొందాం-తథాకస్తు!







## మంగళాశీస్సులు



ఆశ్రమ ఆవిర్భావదినం నుంచీ ఆప్తతతో చేరువైన వారు శ్రీ హనుమంతరెడ్డి, స్వర్ణ దంపతులు. అత్యుత్తమమైన ఉపాధ్యాయ వృత్తిలో పునీతులవుతున్న ఈ దంపతులు తమ కుమారుడు చి॥ రామకృష్ణా రెడ్డి వివాహం చి॥సౌ॥స్వాతితో-సాకేత్(కాప్రా)లో ఉన్న శ్రీ వోర్ల లక్ష్మారెడ్డి కన్వెషన్ హాల్‌లో డిసెంబరు 30వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నలభై ఐదు నిముషాలకు నిర్వహించారు. శాస్త్రోక్త విధిన జరిగిన యీ వైవాహిక బంధంతో ముడిపడిన యీ దంపతులు పరస్పర స్నేహ బద్ధులై, సత్సంతితో వర్థిల్లి, సమాజ కళ్యాణానికీ, మాతృ దేశ సేవకూ తమ వంతు కర్తవ్యాలను నిర్వహిస్తూ, కన్న వారికీ, ఉన్న భూమికీ వన్నె తేవాలని సాయివాణి ఆశీర్వదిస్తున్నది. నవదంపతులు ఆశ్రమానికి వచ్చి, శ్రీ సాయి, గురు దర్శనాలు చేసుకొని పునీతులైనారు. వధూవరులు వీలైనంత త్వరలో స్వదేశపుగడ్డను సేవించేందుకు తరలివస్తారని ఆశ్రమం ఆశీస్సులు.

డాక్టర్ శింగిరెడ్డి జనార్దనరెడ్డిగారు ఆశ్రమానికి బహుకాల అభిమానులు. మంచి దేశభక్తి, సామాజిక స్పృహ ఉన్న కార్యశీలురు. వారు తమ చిన్న కుమారుడు చి॥ విద్యారణ్యరెడ్డి(మధు)కు చి॥సౌ॥ ప్రణవితో నవసంవత్సరపు తొలిరోజున-1-1-'16న ఉదయం గం.9.15 ని.లకు-భోగారం రోడ్‌లోని కె.బి.ఆర్.గార్డెన్స్‌లోని కళ్యాణమంటపంలో కళ్యాణక్రతువు నిర్వహించారు. హిందూ ధర్మ శాస్త్రానుసారం మంత్ర పూతంగా జీవితాలు ముడివేసుకొన్న నవదంపతులు ప్రణవీ, విద్యారణ్యులు కలకాలం పరస్పరానురాగబద్ధులై చక్కని అవగాహనతో జీవించి, తమ సంతతిని లోకోపకారకులైన సత్పౌరులుగా తీర్చిదిద్ది దేశమాత ఋణాన్ని తీర్చుకోవాలని సాయివాణి గురుదేవుల పేరిట ఆశీర్వదిస్తున్నది. అలాగే తాము ఏదైనా స్వకార్యం ప్రారంభించే ముందు మొదట సమాజకార్యం ఒకటి చేయాలన్న స్పృహగల డా॥జనార్దన రెడ్డి దంపతుల త్రోవన వధూవరులు చిరకాలం పయనించాలని కూడా ఆశీస్సులందిస్తోంది.


# మనిషి-మానవుడు

- కె.సంధ్య, 10వ తరగతి

అర్థం లేని పదం మనిషి,
వ్యర్థమైన మనస్తత్వం మనిషి,
డబ్బు సర్వంగా, స్త్రీని సుఖంగా భావించేది మనిషి.
కష్టంలో ఉన్న వారిని చూసి నాకెందుకులే అనే భావం మనిషి,
సుఖంలో ఉన్న వారిని పలకరిద్దాం అని వచ్చే బంధం మనిషి.
చెడు అనే సంకెళ్లకు బానిస మనిషి.
స్వార్థం, అత్యాశ అనే రైలు పట్టాలపై
తాపీగా, కాళ్లు చాపుకొని - ఆగమన్నా ఆగకుండా
డబ్బు సంపాదించాలి అనుకునే భావం మనిషి.
ఇతరులు మంచి స్థాయిలో ఉంటే చూడలేని కళ్లు,
అతనిని దాటి వెళ్లి లక్ష్యాన్ని చేరుకున్నారనే కుళ్లు,
అవినీతి అనే ఊబిలో - అధర్మం అనే చెత్తలో -
మునిగిపోయేది మనిషి.
ఇక - పవిత్రమైన జ్యోతి,
ఎన్ని యుగాలైనా చెరగని కీర్తి,
ఇవన్నీ గల మహామూర్తి మానవుడు.
దీపానికి అండగా ఉండే చేతులు మానవుడు,
తోటకు రక్షగా పువ్వుకు కాపుగా ఉండే తోటమాలి మానవుడు.
దయ, ప్రేమ, త్యాగం మూడు కొమ్మలై పెరిగిన ఇహలోకపు కల్పతరువు
మానవుడు-పరుల కోసమే బ్రతుకు గడుపుతూ కరిగి కరిగి అరిగి
తరిగిపోయే కొవ్వొత్తి మానవుడు.
శరీరం నుండి రక్తధారలు ఆగకుండా ప్రవహిస్తున్నా-
నోటివెంట వందేమాతరం అన్న స్వరం విడువని
అలనాటి మన దేశ నాయకులే నిజమైన మానవులు.
వాళ్లే మనకు దేవుళ్ళు, మచ్చలేని చంద్రుళ్ళు, ఎన్నటికీ చెరగని
మహామూర్తులు - మానవులు.







# భగవాన్ స్మృతులు

- రంగన్

స్కందాశ్రమంలో స్నానం చేసి భగవాన్ ఒళ్ళు తుడుచుకుంటూ ఉండగా నాకు కనపడ్డది, మోకాలు నుంచి పాదాల వరకు తోలు చీరుకుపోయి రక్తం కారుతోంది. "అదేమిటి?" అని అడిగాను.

"నాకు తెలీదు" అన్నారు భగవాన్. "అదేమిటి, ఆ కాల్లో నుంచి అంత గాయమై రక్తం కారుతూ ఉండడమేమిటి? నీకు తెలీకపోవడం ఏమిటి?" అన్నాను.

"ధూపం వేసే కుంపట్లో నుంచి నిప్పు ఎగిరి కాలి మీదకు పడి, కాలినట్లుంది" అన్నారు.

నేను మందు తెప్పించి రాశాను. దాని నుంచి తెలిసింది. శరీరానికి భగవాన్‌కి ఎంత దూరసంబంధమో!

ఒకరోజు నేనూ, భగవాన్ అరుణాచలం పాదాల దగ్గర కాలిబాటను నడుస్తున్నాము. నా కాల్లో ముల్లు విరిగింది. నేను వెనకపడటం చూసి, భగవాన్ వచ్చి నా ముల్లు తీశారు. నాలుగు గజాల్లో, భగవాన్ కాల్లో పెద్ద ముల్లు విరిగింది. నేను చూసి పరిగెత్తుకు వెళ్ళి ఆయన పాదమెత్తి చూస్తే దాని అడుగున అంతా ఎన్నో పాత ముళ్ళు! రెండవ పాదం చూస్తే అదీ అంతే.

"ఏ ముల్లని తీసేస్తావు? కొత్త ముల్లు తీస్తావా; పాత ముల్లు తీస్తావా?" అని ఆ ముల్లుతోనే పాదం నేల మీద రాశారు. ముల్లు విరిగిపోయింది పాదంలోనే. హాయిగా నడిచి వెళ్ళిపోయినారు, నన్ను వెంటబెట్టుకొని.

అది యింకో నిదర్శనం. భగవాన్‌కి శరీరానికి సంబంధం లేదని.

తాను దేహం కాదని, నాకు స్పష్టమయ్యేందుకు ఆ రెండు నిదర్శనాలు భగవాన్ కావలిసే చూపారని నా నమ్మకం.

ఓ సారి భగవాన్ అన్నారు నాతో.

"నీకే మహాకష్టాలు అనుకొంటావు! నా బాధలు నీకేం తెలుసు! విను,

నిటారుగా ఉన్న కొండ మీదికి పాకుతున్నాను. పైన ఉన్న రాయిని ఊతం చేసుకుని పాకబోతే ఆ రాయి వూడి వచ్చి-వెల్లకిలా పడ్డాను. దానితో యింకా రాళ్ళూ నాపై పడ్డాయి. ఎట్లాగో ఆ రాళ్ళను తోసేసి పైకి లేచాను. నా ఎడమ చేతి బొటనవేలు కనబడలేదు. దాని స్థలములో. అది చిటికెన వేలు దగ్గర వ్రేలాడుతోంది. ఆ చోటున వేలిని బలవంతంగా లాక్కొచ్చి దాని స్థలములోకి నెట్టాను" - అని చెబుతూ వుండగా భగవాన్ తల్లి బైటికి వచ్చి "ఆ ఘోరమైనది నేను తల్చుకోలేను. ఒళ్ళంతా రక్తమయమై వచ్చాడు. ఆ దృశ్యాన్ని తలచుకోలేను" అన్నది ఆమె!

ఒకరోజున భగవాన్ ముందే చెప్పింది తల్లి-ఓసారి భగవాన్ ఒంటి నిండా మెడ, రొమ్ము, కాళ్ళ చుట్టూ పాముల్ని చూచిందట. కొంచెం సేపుండి ఆ పాములు మెల్లగా వెళ్ళిపోయినాయట. భగవాన్ తన కొడుకు అనే మాయ నుంచి తప్పించటానికి, భగవాన్ ఆమెకిచ్చిన నిదర్శనమను కుంటా అది.

# జగద్గురు తత్త్వబోధక స్వామి

- రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర

- శ్రీ దిగవల్లి శివరావుగారి కథలు-గాథలు నుండి

(గత సంచిక తరువాయి)

## 'పరంగీలు'

క్రైస్తవ మత ప్రచారం బాగా జరగకపోవడానికి ఇంకొక కారణం కూడా ఉన్నది. క్రైస్తవులైన దేశీయ పరవరులను, వారి మత ప్రచారకులను పరంగీలని దేశీయులనేవారు. దీని నిజమైన అర్థం ఎరుగకపోవడం వల్ల క్రైస్తవ మిషనరీలు ఆ పేరును స్వీకరించేవారు. ఈ పరంగీ అనే పదాన్ని ప్రజలందరూ చాలా నీచమైన అర్థంలో ఉపయోగిస్తూ పరంగీల మతాన్ని కూడా నీచంగా చూసేవారు. నోబిలి జాగ్రత్తగా విచారించగా దీని కారణం





తెలిసింది. 'పరంగి అనే మాటను పోర్చుగీసువారనిగాని, ఐరోపా దేశీయులనిగాని, క్రైస్తవులనిగాని అనే అర్థంలో ప్రజలు వాడడం లేదు. ప్రజలకు వీరి సంగతి తెలియనే తెలియదు. 'పరంగీ' అంటే నీతి ధర్మాలు గాని, మానమర్యాదలుగాని లేక త్రాగుబోతులుగా వుండి అసహ్యకరమైన జంతువుల మాంసాలనూ, తుదకు మనుష్య మాంసాలనూ కూడా పీక్కు తింటూ శాస్త్ర మత ధర్మాలు లేని పశుప్రాయులైన నీచమానవులని ఆ మాటకు అర్థం.

"ప్రతిభాశాలురైన పోర్చుగీసు జాతివారి నెవ్వరినీ హిందువులు చూచి ఉండలేదు. ఇక్కడ ఉండేవారు రెండు రకాలవారుగా వుంటారు. కొందరు ఇక్కడనే పుట్టిపెరిగి పోర్చుగీసు రక్తస్పర్శ ఆవంతయైనా లేకపోయినప్పటికీ నాలుగు పోర్చుగీసు ముక్కలు నోటికి రాగానే తమ అసలు జాతిలోనుంచి బైటపడి పోర్చుగీసు వారిమైతిమనుకునేవారు. వీరిని పోర్చుగీసు వారు 'టోపాజు' సంకరజాతి వాళ్ళని అంటారు. హిందూ దేశీయులు వీరిని పరంగీలంటారు. తెల్లవాడైనా, నల్లవాడైనా పోర్చుగీసు వాళ్ళలాగ దుస్తులు ధరించే నల్లవాళ్ళనందరిని పరంగీలనడం అలవాటయింది. ఇంక ఇక్కడకు వచ్చే ఇంకొకరకం మనుష్యులు పుట్టుక వల్ల యూదులై ఉండిన్నీ పోర్చుగీసు వారితో ఏర్పాటు చేసుకొని వర్తక వ్యవహారాల మీద యిక్కడికి వచ్చేవారు. వీరిని కూడా మధురా పట్టణవాసులు పరంగీలంటారు. ఈ రెండు రకాల వారితో ఏమాత్రం సంపర్కంగల వారికైనా వీరి కులము, శీలము, విశ్వాసపాత్రత, శుభ్రత ఎలాంటివో బాగా తెలిసిన విషయాలే కదా! అందువల్ల 'పరంగీ' అనేమాట నీచంగా వాడబడటంలో ఆశ్చర్యమేముంది?' అని నోబిలీ వ్రాశాడు.

## పద్ధతి మార్చాలి

పైన చెప్పిన సంగతి సందర్భాలన్నీ యోజించిన మీదట హిందువులను క్రీస్తుమత ధర్మాలవైపునకు ఆకర్షించాలంటే ముందుగా మిషనరీలు తమ జీవిత విధానాన్నీ, ఆచారాలనూ, పద్ధతినీ మార్చుకోవలసి ఉన్నదనే సంగతి

స్థిరపడి వుంది.

రాబర్టో డీ నోబిలీ తన ఉద్దేశ్యాలను ఆచరణలో పెట్టేటందుకు ముందు పైవారితో ఆలోచించాడు. రాష్ట్రీయ మతాధికారియైన లెయిర్జియో, నోబిలీ వేసిన పథకాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించాడు. ఆయన పై అధికారియైన క్రాంగనూరు అర్చిబిషప్ప ఫ్రాన్సిస్కోరోస్ గారితో కూడా నోబిలీగారు ఆలోచించి వారి అంగీకారాన్ని పొందినాడు. ఇద్దరూ కలిసి ఒక కార్యాచరణ పద్ధతిని నిర్ణయించారు. ఆర్చి బిషప్పగారు కూడ హిందువుల విగ్రహారాధనను గురించీ, మతధర్మాలను గురించీ వ్రాయబడిన పుస్తకాలను కొన్నింటిని ముందుగా చదివారు. తరువాత మలబారు తీరాన ఉన్న రోమను క్యాథలిక్కు క్రైస్తవ మత ప్రచారకులలో ప్రజ్ఞావంతులైన విద్వాంసులతోను, పోర్చుగల్లు దేశంలో ఉన్న మతాచార్యులతోనూ కూడా ఆలోచించారు. అందరూ కూడా వీరి అభిప్రాయాలతో ఏకీభవించారు. అందువల్ల ఈ ఆర్చి బిషప్పగారు కూడా నోబిలీ గారికి ఈ విషయంలో తమ అంగీకారమును తెలిపారు.

బ్రాహ్మణులు ధరించే శిఖాయజ్ఞోపవీతములు అనగా జుట్టుముడిన్నీ, జందెములున్నూ, వారు పెట్టుకునే గంధాక్షతల బొట్టున్నూ, వారు అవలంబించే ఇతరాచారాలున్నూ వారి మతసంప్రదాయాలకు సంబంధించిన చిహ్నాలు కావనిన్నీ, అవి కేవలము వారు ఉత్తమవంశజులనిన్నీ, ఉన్నత కులం వారనిన్నీ చూపడానికి యేర్పడిన బాహ్యచిహ్నాలనిన్నీ, అందువల్ల క్రైస్తవ మతంలో కలిసిన హిందువులు తమతమ కులాచారాలకు సంబంధించిన జుట్టు, కట్టు, బొట్టు మొదలయిన బాహ్యచిహ్నాలను యేలాంటి అభ్యంతరమూ లేకుండా ఉంచుకోవచ్చుననిన్నీ క్రైస్తవ మతాచార్యులు ఆఖరికి ఒక నిశ్చయానికి వచ్చారు. ఈ సంగతులన్నీ 1609లోను, 1613లోను రాష్ట్రీయ క్రైస్తవ మతాధికారికిన్నీ, క్రాంగనూరు ఆర్చి బిషప్పగారికిన్నీ జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల వల్ల కనబడుతున్నవి.

**(సశేషం)**





# జ్ఞానధామం

ప్రియ మిత్రులారా,

సాయిలీనులు పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి సమాధి మీదుగా నిర్మింప తలపెట్టిన ధ్యానమందిరం **'జ్ఞానధామం'.** దానికి పిల్లర్లు, గోడల నిర్మాణం పూర్తిఅయి డిసెంబరు 24వ తేదీనాడు(రూఫ్)పై కప్ప వేయటం జరిగింది- 30 × 50 అడుగుల కొలతలతో సాగే యీ నిర్మాణాన్ని జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని కార్యకర్తల సంకల్పం.

ఈ జ్ఞానధామంలో కొలువయ్యేందుకై గురుదేవుల అమృత శిలా (పాలరాతి) మూర్తి కోసం జయపూర్‌లో ఆర్డరివ్వటం కూడా జరిగింది. గురుదేవుల దివ్యసాన్నిధ్యాన్ని అంతరాంతరాలలో ప్రత్యక్షంగా అనుభవించాలన్న సంకల్పంతో నిర్మిస్తున్న యీ నిర్మాణానికి సహకరించ దలచినవారు దిగువ ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చును.

**కావలసిన పనులు : 1) ఉడ్‌వర్క్ (వడ్రంగి పని), 2, రాయి పరవటం, 3.వైరింగ్, 4.ప్లాస్టరింగ్, 5. కలరింగ్, 6. గోపురం.**

సాయిధామానికి అందే డొనేషన్లకు “80జి” ప్రకారం ఇన్‌కంటాక్స్ రాయితీ లభిస్తుంది కూడా. భక్తులకు యీ సేవాభాగ్యం కలుగుగాక!

**ఫోన్స్ : 9440413455**
**9848133565**

**- ధర్మాధికారి**

# సంస్మరణిక


ప్రియ మిత్రులారా,

పరమపూజ్య గురుదేవుల పేరిట ఒక సంస్మరణిక వెలువరించాలని ఆశ్రమం సంకల్పించింది. మీకు గురుదేవులతో గల అనుభవాలను, మీరు పొందిన స్ఫూర్తిని, వారిలో మీరు చూచిన విశిష్టతలను వ్రాసి (రెండు పేజీలు అచ్చులో వచ్చేలాగా) మార్చి 15 లోపల పంపితే సంస్మరణికలో చేర్చి అచ్చువేద్దాం. మనం గురుదేవుల కివ్వగలిగే అక్షరహారతి ఇదే గదా!

mail : saidhamam.ram@gmail.com, saidhamam.seva @ gmail.com' అన్న ఈ-మెయిల్‌కు కూడా పంపవచ్చు.

**- మాతాజీ,**
**ధర్మాధికారి.**

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

**(గత సంచిక తరువాయి)**

పీతాంబర్‌కు కన్నీళ్లు ప్రవహించాయి. గురువుకు సాష్టాంగ నమస్కారం చేసి కొండోలి అనే ఒక గ్రామానికి వెళ్ళి ఒక రాత్రి, ఒక పగలు గడిపాడు. అక్కడ చాలా చీమలు ఉన్నాయి. అందుచేత అతడు చెట్టు ఎక్కి కూర్చున్నాడు. కాని ఆ ఎర్రని పెద్దపెద్ద చీమలు అతన్ని వెంటాడాయి. అతను వాటిని ఒదిలించుకోవడానికి ఎన్నో చెట్లు ఎక్కుతూ, దిగుతూ .. కాని ధ్యానానికి సురక్షితమైన స్థలమే కనబడలేదు. ఇంత పెద్దమనిషి అలా కోతిలాగా చెట్లు ఎక్కుతూ, దిగుతూ ఉంటే అక్కడున్న గొడ్లు కాచే పిల్లలకు తమాషాగా అనిపించింది. అంతేకాదు- చిన్ని చిన్న రెమ్మలను పట్టుకొని చెట్టు చిటారి కొమ్మకు వెళ్ళి కూడా అతను పడటం లేదు, అది అద్భుతంగానూ తోచింది. అందులో ఒకడు యిలా అన్నాడు. "గజానన మహారాజు శిష్యులొక్కరే యిలాంటి చమత్కారాలు చేయగలరు". ఆ పిల్లలంతా వెళ్ళి యీ కబురు తమ ఇళ్ళలో చెప్పారు. ఆ గ్రామీణులు ఆ మామిడితోటలోకి వచ్చారు. కొందరు "ఇతనెవరో తిక్కవేషాలు వేస్తున్నాడు. మన దృష్టిని ఆకర్షించడానికి చేస్తున్నాడు. మనకు భాస్కర్‌పాటిల్ తెలుసు కదా! అతను కూడా గజాననుల శిష్యుడే యిలా ఎప్పడూ చేయలేదు. స్వామి దగ్గర మిఠాయిలు వదిలిపెట్టి వారి శిష్యులు యిలా వీధి పక్కన ఎందుకు పడి ఉంటారు!" అన్నారు.

వారంతా పీతాంబర్‌ను అడిగారు - అతని కథ ఏమిటని. అతను చెప్పిన దాన్ని వాళ్ళెవ్వరూ నమ్మలేదు. "చాల్లేవయ్యా! మధ్యలో మహారాజు





పేరు ఎందుకు తెస్తావు? రోజు కూలి కోసం వెతుక్కునే ఆడది. మహారాణి అంటే ఎవరు నమ్ముతారు?" అన్నారు. "శ్యామ్‌రావు దేశ్‌ముఖ్ అనే అతను "ఒరేయ్! మోసగాడా! గజాననులు దైవంతో సమానులు. ఆయన నీకు గురువని చెప్పి అవమానించకు. ఒకసారి వసంతం కాకపోయినా బలరాం మామిడిచెట్టు పూత, కాపుతో నిండిపోయేలా చేశారు గజాననులు. నీకేమైన అలాంటి శక్తి వుందా! నువ్వు అలా చేసి చూపెడితే వారి శిష్యులని నమ్ముతాము. లేకపోతే మెత్తగా బాదుతాం. అదుగో ఆ ఎండిన చెట్టును పచ్చబరిచి చూపు" అంటూ బెదిరించి చూపించారు.

పీతాంబర్ తన మాట వినమని బ్రతిమాలుకున్నాడు. తాను గజాననుల శిష్యుడినేననీ, రత్నాలు, రాళ్ళూ ఒకేచోట దొరికినంత మాత్రాన రెండూ సమానం కావనీ, తాను చేతకానివాడనయినప్పటికి గజాననుల శిష్యుడినన్నది సత్యమనీ నొక్కి చెప్పాడు. "అతిగా వాగకు. గురువు ఎప్పడూ శిష్యుడిని కష్టంలో ఉన్నప్పడు రక్షిస్తాడు. శిష్యుడికి ఏ శక్తీ లేకపోయినా గురువే ఏదో మాయ చేసి అతడిని కాపాడతాడు" అన్నాడు శ్యాంరావు. అది విని పీతాంబర్‌కు ఏమీ తోచలేదు. కళ్ళు మూసుకొని ఏకాగ్రచిత్తంతో యిలా ప్రార్థించసాగాడు -

ఓ గురుదేవా! నాకు ఏ శక్తీ లేదు. కానీ, నా మూలంగా మీ పేరు చిన్నబోవడం నేను భరించలేకపోతున్నాను. ఈ మ్రోడును మీరు చిగురింపజేయండి. మీ గొప్పతనాన్ని మీరు యిప్పడు చూపకపోతే వీరంతా నన్ను చంపేస్తారు. ప్రహ్లాదుడిని రక్షించడానికి నరహరిగా స్తంభంలో పుట్టలేదా! జనిని శూలం మీదికెక్కించి చంపబోతున్నప్పడు భగవంతుడు దానిని కరిగింపజేసి జనిని కాపాడలేదా! భగవంతుడు, సాధవులు ఒక్కటే. పూలు దండగా గుచ్చితే ఆ పరిమళం దారానికి కూడా

అంటుతుంది గదా! నీవు పుష్పం, నేను దారం. నేను మట్టిగడ్డను. నీవేమో పరిమళాలు చిందే కస్తూరివి. నాకూ కొంచెం ఇవ్వు, రా స్వామీ! వచ్చి నన్ను రక్షించు. ఈ ఎండుచెట్టు నిండా పచ్చని ఆకులు అద్దు". అటుపైన పీతాంబర్ గజాననుల గురించి అందరితో భజన చేయించాడు. అలా కాసేపు జరిగిందో లేదో ఒక అద్భుతమైన విషయం అక్కడ సాక్షాత్కరించింది. ఒక్క క్షణంలో ఆ చెట్టంతా చిగుళ్ళతో, పచ్చని ఆకులతో నిండిపోయింది. కొందరు కల కనడం లేదు కదా అనుకున్నారు.

మరికొందరు యిది ఏదో కనికట్టు విద్య అనుకున్నారు. ఆకులు కోసి చూసారు. వాటిలోంచి రసం ఊరుతూ కనిపించింది. అందరూ ఒక్కసారిగా "గజానన మహారాజుకు జై" అని అరిచారు. పీతాంబర్‌ను తమ చేతులతో ఎత్తి గ్రామం దాకా మోసుకొని వెళ్ళారు. ఈ మహిమాన్వితుడు అయిన శిష్యుడిని చూడడానికి ఎప్పుడో ఒకసారి గజాననులు తమ గ్రామానికి వస్తారని వాళ్ళంతా నమ్మారు. సమర్థ రామదాసు స్వామి తమ శిష్యుడు కళ్యాణ్‌ను దోముగాఁవ్‌ను ఉద్ధరించడానికి పంపినట్లే- గజాననులు పీతాంబర్‌ను తమ గ్రామానికి పంపారని నమ్మారు, వజ్రపు తునకలాంటి పీతాంబర్ కోసం ఖండోలిలో ఒక ఆశ్రమం నిర్మించారు. పీతాంబర్ చివరి వరకు అక్కడే ఉండి సమాధి చెందారు. ఆనాటి మామిడి చెట్టు యిప్పటికీ బ్రతికే వుంది. ఏటా మిగిలిన చెట్ల కంటే ఎక్కువ పండ్లను కాస్తుంది.

గజాననులు శేగాఁవ్‌లో ఉన్నారు. ఒకరోజు పరధ్యానంలో కనిపించారు. ఎందుకని శిష్యులు ప్రశ్నిస్తే - "కృష్ణ పాటిల్ మరిలేడు. నాకతను యిచ్చే మృదువైన వక్కలు ఎవరు తెచ్చిస్తారు? పాపం అతని కొడుకు రామ్ చాలా చిన్నవాడు. వాడు పెరిగి నన్ను సేవించేది ఎప్పుడు! అందుకే నేను





యీ చోటు వదిలిపెట్టాలి అనుకుంటున్నాను" అన్నారు. భక్తులంతా మహారాజు తమను విడిచి వెళ్ళకూడదని పదేపదే ప్రార్థించారు. ఆ చోటు నచ్చకపోతే శేగావ్‌లో యింకెక్కడైనా ఉండమన్నారు. గజాననులు దానికి యిలా జవాబు ఇచ్చారు. "నగరంలో చాలా గొడవలు ఉన్నాయి. నేను ఏదో ఒక పక్షాన ఉండదల్చుకోలేదు". ఎవ్వరికీ చెందని భూమి ఉంటే సరే-లేకుంటే ఊరు విడిచి వెళ్ళిపోతాను అన్నారు. భక్తులు చాలా చింతపడ్డారు. గజాననులు తమకు ప్రియతములుగానీ, బ్రిటిష్ వారికి కాదు కదా! వారు ఒక ఆధ్యాత్మిక గురువుకు స్థలం ఎందుకు ఇస్తారు? అందుచేత మహారాజు ఎవరైనా శిష్యుల స్థలాన్ని తీసుకోవాలి అనుకున్నారు.

గజాననులు అందుకు అంగీకరించలేదు, "ఏమి మాట్లాడుతున్నారు మీరు? భూమి భగవంతుడిది. ఎవరెవరో రాజులు వస్తుంటారు, పోతుంటారు కాని నిజానికి భూమి మాత్రం పాండురంగడిదే. ఇక్కడ చెత్త మాట్లాడుతూ కాలం వృథా చేయకండి. హరిపాటిల్‌ను తీసుకువెళ్ళి ప్రయత్నించండి" అన్నారు. హరిపాటిల్ ఒక దరఖాస్తు రాసి బేల్‌దాన జిల్లాకు చెందిన కలెక్టర్‌కు అందించారు. ఆయన వెంటనే "మీరు రెండు ఎకరాలు అడిగారు. కాని ప్రస్తుతానికి నేను ఎకరం ఇస్తాను. మీరు దానిని చక్కగా ఉపయోగించుకుంటే పై ఏడు మరో ఎకరం ఇస్తాను" అని వ్రాశాడు. (ఈ ఆర్డరు రికార్డు ఆఫీసులో ఉన్నప్పటికీ మనం చూడవచ్చు.) మహనీయుల వాక్కు యొక్క శక్తి అటువంటిది. ఇక బంకట్‌లాల్, హరిభావ్ మొదలైనవారు చందాలు పోగుచేశారు. కొద్దికాలంలోనే తగినంత సొమ్ము చేకూరింది.

**(12వ అధ్యాయం సమాప్తం)**

**(సశేషం)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

29-02-1912

ఉదయం ప్రార్థనయ్యాక మామూలుగా మా పంచదశి క్లాసు నడిచింది. మేమక్కడ ఉన్నప్పుడే సాయిబాబా నడుస్తూ సాఠే వాడా దగ్గరకు వెళ్లడం చూచాము. ఆయన బాగా అలిసిపోయినట్లు కన్పిస్తున్నారు. ఆయన తిరిగి వచ్చాక ప్రశాంతంగా కన్పించారు. బాలాసాహెబ్ భాటే ఒక క్షత్రియుడనీ, అతని భార్య సాలె మనిషనీ, వాళ్లబ్బాయి బాబా కూడా సాలె అనీ అన్నారు. వాసుదేవ కాకా పూర్వజన్మలో రాజపుత్రుడనీ, అప్పటి పేరు జైసింగనీ అన్నారు. అతనికి మాంసమంటే చాలా యిష్టమనీ, సాయిబాబా యితరులూ అతన్ని 'నీకు మేక తల కావాలా?' అని అడిగి బాగా బాగా కోపం తెప్పించేవాళ్లమని చెప్పారు. జైసింగ్‌కు ముగ్గురు కొడుకులు - వాళ్లంతా సైన్యంలో పనిచేసేవారు - కూతురు త్రోవతప్పింది - ఒక మంగలికి ఉంపుడుగత్తె అయింది - అతనికే బిడ్డలను కని, అక్కడే చనిపోయింది - అని కూడా చెప్పారు. మధ్యాహ్నహారతి మామూలుగానే అయిపోయింది. తరువాత వచ్చిన వామన్‌తాత్యా పూజ చేసుకుంటానని అడిగి బాగా చివాట్లు తిన్నాడు. మధ్యాహ్న భోజనం - కొద్దిగా విశ్రాంతి- అటుపై మా పంచదశి పాఠం మొదలుపెట్టి, సాయంత్రం బాబాను నడక సమయంలో చూచాము. వాడా హారతి తరువాత నేను చావడి ఉత్సవంలో పాల్గొని శేజారతికి వెళ్లాను. సాయీసాహెబ్ కోపంగా కనిపిస్తూ, మసీదు మీద దీపాలు వెలిగించేందుకు వెళ్లిన వారందరినీ తిట్టారు. ఊరేగింపు ప్రారంభం





కాగానే ఆయన తన కర్రను బాపూసాహెబ్ భార్య తాయీజోగ్‌వైపు విసిరారు. చావడి దగ్గరనుకుంటా - ఆయన బాపూసాహెబ్ రెండు చేతులూ పట్టుకొని హారతెందు కిచ్చావని గద్దించారు. తరువాత బాలాషింపీని తన కర్రతో కొట్టారు. మారుతి అని మేం పిలిచే త్రయంబకరావు మీదికి కూడా కర్ర విసిరారు. బాలాషింపీ పారిపోయాడుగానీ త్రయంబకరావు నిలబడీ, బాబా ముందు సాష్టాంగపడీ కూడా దెబ్బతిన్నాడు.

01-03-1912

నేను పదకొండు గంటల వేళ మసీదుకు వెళ్లి చూస్తే సాయిసాహెబ్ మంచి మూడ్‌లో ఉన్నారుగానీ బాగా అలసిపోయినట్లున్నారు. త్రయంబకరావు ఫకీర్‌బాబాను తిట్టేదాకా వచ్చాడు. కానీ యిదంతా నాకు అల్పవిషయంగా తోచింది. మధ్యాహ్నహారతి మామూలుగానే గడిచింది. సాయిబాబా దీక్షితునీ, నానాసాహెబ్, చందోర్కర్‌నీ, సాఠేనీ గుర్తు చేసుకున్నారు.

03-03-1912

కాకడహారతికి వెళ్లాను. సాయిమహరాజు ప్రసన్నంగా కన్పించారు. పరుషోక్తు లేమీ లేకుండానే మసీదులోకి వెళ్లారు. పైనుండి వ్రేలాడే దీపాన్ని అబ్దుల్లా దించబోతుంటే అది చేజారి క్రిందపడి ముక్కలైపోయింది. ఇది సాయిబాబాకు కోపం తెప్పిస్తుందనుకున్నానుగానీ అలా జరగలేదు. ఆయన దాన్ని పట్టించుకోలేదు. మేము పంచదశి మా గదిలో కూర్చుని చదువుకున్నాము- వరండాలో బాగా గాలి విసురుగా ఉండటం చేత. సాయిబాబా బయటికి వెళ్లటం, తిరిగి మసీదుకు రావటం కూడా చూచాను. నేను పూర్వజన్మలో ఆయనతో రెండు, మూడు సంవత్సరాలున్నాననీ, నాకు హాయిగా బ్రతకడానికి సరిపడినంత సమయం ఉన్నాగానీ నేను రాచకొలువుకు వెళ్లాననీ అన్నారు బాబా. ఇంకా వివరాలు విందామని నాకున్నదిగానీ సాయిబాబా ఏమీ చెప్పలేదు.

(సశేషం)

# గురుదేవులతో కబుర్లు

గురువుగారండీ, నమస్కారమండీ!

మొన్న డిసెంబరు 25వ తేదీన మిమ్మల్ని తలచుకోని క్షణం లేదు. మర్చిపోతేగా గుర్తు చేసుకోవటం అసలు. కాకపోతే ఆరోజు మరీ గాఢంగా మనసులు బాధపడ్డాయి. ఆరోజు మన రాంబాబుకు మీరు దీక్షనిచ్చిన రోజు. వాడు ఉదయం పూజ తరువాత వచ్చి చాలాసేపు బాధపడ్డాడు. పదిగంటలకు వ్రతం జరిగింది. వ్రత కథలు చదువుతున్నపుడు తాము తమ గురువును సేవించిన తీరును గూర్చి సాయిబాబా వారు చెప్పే ఇతివృత్తం చదువుతున్నాడు రాము. వింటున్న నాకు - "ఒక పన్నెండు కాదు, రెండు పన్నెండేళ్లు మీ పాదాల దగ్గరే పడి ఉన్నాం. ఇంత దయ మాలి వెళ్లిపోయారే!" అన్న వేదన లోలోన కదిలి, కన్నీరుగా మారితే- సరిగ్గా అదే సమయంలో శ్రీ సాయిపటంపై నుంచీ ఓ పెద్ద చేమంతి పువ్వు రాలి పడి "పిచ్చితల్లీ! ఇదుగో నేనిక్కడే ఉన్నానుగా!" అన్నది రేకు కన్నులు విప్పార్చి. మనసు కాస్త చల్లబడింది. అన్నట్లు డిసెంబరు 22వ తేదీన -

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ పరిపూర్ణానందగిరి వారు ఏర్పేడు నుంచీ వచ్చారు. మీరు తరలిపోయిన నాటి కబుర్లన్నీ తెలుసుకున్నారు. "బ్రహ్మరంధ్రం ద్వారా ప్రాణాలు పోవటం అరుదుగా దక్కే అదృష్టం. వారు మహర్షి. ఎంతో ఉన్నతులు" అని చాలా ఆర్ద్రంగా చెప్పారు. వారు మీరు శయనించిన చోటికి వచ్చి, సమాధిపై చేతులుంచి నమస్కరిస్తుండగా .... ఎప్పడో ఉదయం ఏడు గంటలకు మీ తలపై అలంకరించిన పుష్పం ఆ పదకొండు గంటల వేళ వారి చేతుల మీదికి రాలిపడింది. వెంటనే స్వామివారు చాలా సంతోషంతో మీ (విగ్రహపు) చెక్కిళ్లు నిమిరి "నన్ను పలకరిస్తున్నారా





స్వామీ!" అని ఆ పుష్పం పదిలంగా తీసుకున్నారు. నా పిచ్చి కాకపోతే యిదంతా మీకు తెలియకనా! ఏదో-యిదో అమాయకత్వం మాది-అంతే!

మీ రూపు పాలరాతిలో నిక్షిప్తం చేసుకోవాలన్నది మీ వాళ్లందరి కోరిక. అవునూ - మీ వాళ్లెవరు? మేము మాత్రమేనా? ఆకృతులు వేరైనా ఆత్మ ఒక్కటే అన్నది మంత్రంలా ధ్యానించిన మీకు-కాని వారెవరు! అందరి కోసం మీరు అమృత శిలారూపంలో రావాలన్న కాంక్షతో రాంబాబు, చంద్రన్న, జయపూరు వెళ్లారు. వందల విగ్రహాలకు రూపురేఖలు దిద్దిన కళాకారుడికి మీ బొమ్మ చేసే పని అప్పగించారు. ప్లాస్టరాఫ్ పేరిస్‌తో చేసాడు. రూపం వచ్చింది. కానీ, కళ్లలో ఆ తేజం, పెదవులపై ఆ పలుచని నవ్వు ఎంత ప్రయత్నించినా కుదరలేదట. "ముఝే మాఫ్ కీజియే మహరాజ్! ఆప్‌కే చేహరేపర్ జో అలౌకిక్ తేజ్‌హై వహ్ మేరే హాథోంసే నహీం ఆరహా. ఆప్ ఖుద్ యహ్ కామ్ కరియే" (నన్ను క్షమించండి స్వామీ! మీ ముఖంపై ఉన్న ఆ అలౌకిక తేజం తేవటం నాకు చేతకావటం లేదు. మీరే స్వయంగా తెచ్చుకోండి) అని అతడు విగ్రహం ముందు మోకరిల్లి నమస్కరించాడట. ఆ మాట ఫోన్‌లో విన్న నాకు నవ్వు వచ్చింది. "మీది బ్రహ్మ చేసిన బొమ్మ. దాన్ని అనుకరించి మరో బొమ్మ చేయగలడు కళాకారుడు. కానీ, మీ తపశ్శక్తితో మీరు సాధించుకొన్న ఆ తేజస్సు అతనెలా తేగలడు? ఆ పనేదో మీరే చేసుకోండి" అని ప్రార్థించాం మేము కూడా. ఓ పావుగంట తరువాత మరో ఫోటో వచ్చింది వాట్సప్‌లో. నిజంగా మీలాగే ఉంది. ఇప్పడు నాకెలా ఉందో తెలుసా గురువుగారండీ! మీరేదో కార్యక్రమం మీద బయటికి వెళ్లారు. మిమ్మల్ని తీసుకురావడానికి రామూ వాళ్లు వెళ్లారు. ఇప్పడో, అప్పడో మిమ్మల్ని తీసుకువచ్చేస్తారు - అన్నట్లుంది. ఎన్నాళ్లు నిరీక్షించాలో మీ రాక కోసం! అంతదాకా మీ పిచ్చితల్లిని ఆశీర్వదించి, అంతికాన నిలుపుకోండి గురుదేవా! సెలవా!

# నల్లి కథ

అనగనగా ఓ ఊర్లో ఒక ధనవంతుడున్నాడు. భార్య పేరు బంగారమ్మ. ఆయనకు ముగ్గురు కూతుళ్లున్నారు. అందరూ తల్లి పోలిక పిల్లలు. మంచి అందగత్తెలు. తండ్రి ఆ ముగ్గురికీ బోలెడన్ని కట్న కానుకలు, నగలూ అవీ యిచ్చి వివాహాలు చేసి అత్తగారిళ్లకు పంపాడు. ఈ ముగ్గురూ చిన్ననాటి నుంచీ ఏ పనీ చేసి ఎరుగరు. తల్లి గారాబంతో అపురూపంగా పెరిగారు. చిన్న పనికైనా సరే ఆపసోపాలు పడతారు. వాళ్లు చీటికీ మాటికీ ఏదో ఒక వంకన పుట్టింటికి రావటం, తండ్రి నచ్చజెప్పి దిగబెట్టి రావటం పరిపాటిగా మారింది. ఆడపిల్లల పెంపకంలో తల్లి పాత్ర సరిగా లేకపోతే సంసారాలు ఇంతేగా మరి!

ఇలా ఉండగా - ఓరోజు పెద్ద కూతురు రత్న పుట్టింటికి వచ్చింది. వస్తూనే తల్లిని పట్టుకొని గావురు బావురుమంటూ ఏడవసాగింది. ఏమైందో చెప్పమని తల్లి అడగ్గా అడగ్గా -

"ఏం చెప్పమంటావే అమ్మా! కరక్కాయంత కుండలో ముత్యాలంటి బియ్యం పోసి అగ్గి లేకుండానే నేను అన్నం వండుతుంటే - మెతుకు ఎగిరొచ్చి కాలి మీద పడింది. చూస్తూ నుంచున్న చెట్టంత మనిషి నీ అల్లుడు "అయ్యో కాలిందా? అనకపోయె - ఆ పళంగా వైద్యుడిని పిలవకాపోయె! ఇంత జరిగాక యింకెందుకమ్మా ఆ కాపురం? నన్ను పంపకే అమ్మా!" అని మళ్లీ రాగాలాపన మొదలెట్టింది.

అంతలో రానే వచ్చింది రెండో రాలుగాయి రవ్వ. వస్తూనే అక్కనూ, అమ్మనూ చూచి కన్నీళ్లు కార్చుకొంటూ వెక్కిళ్లు పెట్టసాగింది. "ఏమైందే తల్లీ?" అని అడిగింది బంగారమ్మ. "ఏం చెప్పుకోను! సిగ్గుచేటు ఎవరైనా వింటే" - అంది రవ్వ. "చెప్పవే, ఇక్కడున్నది మనమేగా!" అంది రత్న. "ఇందాక మల్లెపందిరి క్రింద నిలబడి మొగ్గలు తుంచుతున్నానే! మూడు మొగ్గల గుత్తి వచ్చి చెంపకు తగిలింది. ఆ పళంగా కెవ్వుమని అరిచి క్రిందపడిపోయాను. కుర్చీలో కూర్చొని అంతా చూస్తున్న అతగాడు- అదే నీ అల్లుడు-వచ్చి లేపలేదు సరిగదా "ఓసి నీ సుకుమారం తగలెయ్య" అన్నాడు. అంత కనికరంలేని వాడితో నేనిక బ్రతకలేనే అమ్మా!" మళ్లీ వెక్కిళ్లు పెడుతోంది రవ్వ.

వాకిట్లో ఏదో చప్పుడైతే తలలు తిప్పి చూచారు ముగ్గురూ. ఇంకెవరు చిన్నమ్మాయి గారు పుష్యరాగం వచ్చేసింది. ఆరున్నొక్కరాగంతో సహా. అక్కలనూ, అమ్మనూ





చూచి స్వరం పెంచింది కూడా. ఓదార్పులయ్యాక అమ్మాయి తన దు:ఖకారణం బైటబెట్టింది. "మా యింటి ప్రక్కన అటుకులు దంచుతున్నారమ్మా! మూడు రోకళ్లతో ఆగకుండా వేయించిన వడ్లు ఆరిపోకముందే దంచాలిగా మరి! ఆ ధన ధన శబ్దాలకు నా చెవులు చూడు ఎలా కందిపోయాయో! సరసమెరుగని నా మొగుడు నా సున్నితత్వాన్ని మెచ్చకపోగా వెక్కిరించాడే! ఇంకెందుకు ఈ సంసారం! ఇంతకన్నా ఏ అడవిలోనో ముక్కు మూసుకు తపస్సు చేసుకోవటం మేలనిపించింది. కడసారిగా నిన్ను చూచి వెడదామని వచ్చానే అమ్మా?" అన్నది ఆరున్నొక్కటో రాగంతోసహా. "ఒక్కదానివే కాదులే చెల్లీ! నేనూ వస్తా పద" అన్నది రత్న. ముందుగానే లేచి నిలబడింది రవ్వ.

"ఆగండే అమ్మాయిలూ! నేను కూడా వస్తా, ఒక్క క్షణం ఆగండి" అన్నది అమ్మ బంగారమ్మ. "నువ్వెందుకమ్మా! నీకు మా నాన్న ఏం లోపం చేసాడనీ!" అన్నారు కూతుళ్లు. "అయ్యో, మీకేం తెలుసే తల్లీ నా బ్రతుకు! మొన్నటికి మొన్న -చిలకపచ్చ పట్టుచీరగట్టి ఏడు వారాల నగలు పెట్టుకొని, వెండిబిందె చంకనెత్తుకొని, అభిషేకానికి నీళ్లకని నలుగురితో కలిసి నీలాటి రేవుకు వెళ్లాను. దారిలో రచ్చ మీద కూర్చున్న రాజేంద్రభోగి మీ నాన్న "ఆవిడేనయ్యా నా యింటి లక్ష్మి" అని మాటమాత్రంగానైనా అక్కడివారికి చెప్పలేదే! సాటివారిలో నగుబాటులయ్యాక - యిక నాకు మాత్రం యీ సంసారం దేనికీ? పదండి పోదాం! అన్నది బంగారమ్మ.

తల్లీ బిడ్డలు దండకారణ్యంలో తీవ్రంగా తపస్సు చేసారు ఏడాదిపాటు. ప్రత్యక్షమైన బ్రహ్మ వారికి ఏమి వరం కావాలని అడిగాడు. వాళ్లు తమ కష్టాలన్నీ చెప్పుకొని భర్తలు తమ చెప్పుచేతుల్లో, చెప్పుల క్రింద తేళ్లలా ఉండే విధం ఏదైనా చెయ్యమని అడిగారు. బ్రహ్మదేవుడికి ఒళ్లు మండిపోయింది. "ఓ భక్త శిఖామణులారా, మీలాగా ప్రపంచంలో ప్రతిదీ కష్టంగానే భావించే వారికి నరజన్మ యివ్వటం నాదే పొరపాటు. ఇదుగో-నలుగురూ కలిసి తపస్సు చేసారు గనుక మీ అంశలతో 'నల్లి' అనే జీవిని సృష్టిస్తున్నాను. మీరంతా నల్లి రూపంలో మీమీ భర్తల ప్రక్కల క్రింద చేరి వారిని కుడుతూ బ్రతకండి-పొండి" అనేసి మాయమైపోయాడు. ఇంకేముంది! భూమి మీదికి నల్లులు వచ్చేసాయి.

***జాగ్రత్త! లేనిపోని ఆపసోపాలు పడ్డారో ... మీరు కూడా పై జన్మలో నల్లులే సుమా!***

# గురు వాణి-2

ప్రియ ఆత్మస్వరూపులారా,

మానవులు సాధారణంగా ప్రేమ, మమకారాలు ఒక్కటేనని భావిస్తుంటారు. ప్రేమలో వాత్సల్యం, మాధుర్యం, మైత్రి, అభిమానం అన్నీ పెనవేసుకొని పోయి ఉంటాయి. శిశువు 'పసి'(పశు)ప్రాయుడుగా ఉన్నపుడు వాడికి ఏ భావాలూ ఉండవు. ఒక్కొక్క నెల పైబడుతున్నకొద్దీ తనను ఎవరు ఎక్కువ లాలిస్తున్నారో వారి పట్ల ప్రేమభావం అప్రయత్నంగానే వాడిలో జన్మిస్తుంది. తల్లి తన తనువులో నుండీ వచ్చినవాడు గనుక బిడ్డను ప్రేమిస్తుంది. బిడ్డ తనకు దగ్గరగా ఉండి ఉపచారాలు చేస్తున్నది గనుక తల్లిని ప్రేమిస్తాడు. అలాగే మిత్రులు, బంధువులు ఒకరినొకరు ప్రేమించుకోవటం కూడా పరస్పర ఆధారం వలననో, 'నా వాళ్లు' అనే అభిమానం వల్లనో ఏర్పడేవే. అందుచేత యివన్నీ మమకారాలే. ఇందులో కొన్ని గాఢమైనవీ, కొన్ని కాస్త లఘువుగా ఉండేవీ ఉండవచ్చు. మాతృప్రేమకు మాత్రం వీటిలో కొంత మినహాయింపు ఉంటుంది. బిడ్డకు జన్మనివ్వడం కోసం తల్లి ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడటమే దీనికి కారణం. ఇక మిగిలినవన్నీ పూర్తి మమకారం (నాది అనే భావన) నుండీ పుట్టినవే.

మరి, అసలైన ప్రేమ అంటే ఏమిటి? ఏది దుఃఖాన్నివ్వదో, అలౌకికానందాన్నిస్తుందో, దేనికి ఫలాపేక్ష లేదో-అది ప్రేమ. ఆస్తిపాస్తులపైన, వస్తువులపైన, మనుష్యులపైన, దారాసుత బంధుమిత్రాది ఆప్తులని మనం భావించే వారిపైన ఉండే ప్రేమ-వాటి వియోగం వలన, అవి దూరమైన బాధతో దుఃఖాన్ని కల్గిస్తుంది. వాటిని నిలుపుకోవాలన్న తపన కూడా దుఃఖాన్నే కల్గిస్తుంది. కన్నీళ్లు వేరు-దుఃఖం వేరు. దుఃఖం వలన కన్నీళ్లు వస్తాయి. కానీ, అన్ని కన్నీళ్లూ దుఃఖం వలననే రావు. ఆనందం వలన కూడా కొన్ని





సార్లు వస్తాయి. అంతేకాదు-ఎదుటి వాడి బాధను చూచి సహానుభూతితో గుండె కరిగి కూడా కన్నీళ్లు వస్తాయి. మరొక ఉత్కృష్టస్థాయిలో కూడా కన్నీరు వస్తుంది. అది భగవద్భావన మనసంతా నిండి చుట్టూ ఉన్న ప్రకృతిలో, జీవులలో కూడా ఆ భగవదంశను చూడగలిగినపుడు-మన లోపలి అంతరాత్మలో కలిగే చైతన్యం వలన కలిగే స్పందనతో వచ్చే కన్నీరు అలాంటి అత్యుత్తమమైనది.

ఇక అలౌకికానందం-మనకు ఎటువంటి సంబంధమూ లేకపోయినా, కేవల సహానుభూతితో-వాళ్ల బాధలు తీర్చగలిగినపుడు మనకు ఆనందం కలుగుతుంది. ఇది లౌకికంగా ప్రత్యుపకారాన్నిగానీ, ఎటువంటి కీర్తి, పొగడ్త, కృతజ్ఞత ఆశించి చేసినట్టిదిగానీ కాకూడదు. కేవలం ఎదుటివారిలో నీ ఆత్మ ప్రతిబింబాన్నే భావించి, వారి బాధలు నీవిగానే భావించి సేవించినపుడు కలిగే ఆత్మానందం. ఇది అలౌకికం. స్వచ్ఛమైన ప్రేమ వలన మాత్రమే లభిస్తుంది. 'మన' అనే భావంతో చేసే సేవ వెనుక స్వార్థం, మమకారం ఉంటాయిగానీ స్వచ్ఛత ఉండదు. అందుచేత అప్పుడు కలిగేది లౌకికానందమే. రంతిదేవ చక్రవర్తి ముందు దేవతలు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నపుడు

'నత్వహం కామయే రాజ్యం నసుఖం నాఽపునర్భవమ్

కామయే కేవలం దుఃఖతప్తానాం ఆర్తి నాశనమ్ ॥ (నాకు రాజ్యం వద్దు, సౌఖ్యం వద్దు, చివరికి మోక్షం కూడా వద్దు, బాధతో ఉన్న వారి ఆర్తిని పోగొట్టగలిగితే అదే చాలు) అని కోరుకోవటం వెనుక రహస్యమిదే. ఈ అలౌకికానందప్రాప్తే.

'ప్రేమ' అన్న పదానికి 'ప్రీఞ్'(తర్పణే) అన్న ధాతువు మూలాధారం. అంటే ఆనందాన్నిచ్చేది ప్రేమ అని అర్థం. జాలి, ప్రేమ ఒకటిగా పొరపాటు పడతారు కొందరు. అది సరికాదు. జాలిలో మన ఆధిక్యభావన-మనకన్నా తక్కువ

వారికి మనం చేస్తున్నామన్న భావన ఉంటుంది. అది ప్రేమలో ఉండదు. స్వచ్ఛతే ఉంటుంది.

ప్రేమలో ఫలప్రాప్తిని గూర్చిన కాంక్ష ఉండదు. శ్రీకృష్ణుడు శిరోవేదన అనుభవిస్తున్నాడు (నటిస్తున్నాడు). అది తగ్గే ఉపాయం ఏమిటని అడిగిన నారదునితో నా భక్తుల పాదధూళితో తప్ప మరే మందుతోనూ తగ్గద"ని చెప్పాడు. నారదుడు అష్టమహిషులను అడిగాడు. "అయ్యయ్యో! మా పాద ధూళి భర్తగారి తలకు రాస్తే మాకింక పుట్టగతులుంటాయా!" అని చెంపలు వేసుకున్నారే తప్ప ఏమీ చెయ్యలేకపోయారు. కృష్ణయ్య ఆప్తులింకెందరిని అడిగినా లాభం లేకపోయింది. చివరికి గోపికల దగ్గరకు వెళ్లాడు నారదుడు. విషయం వింటూనే వారు గబగబ ఒక వస్త్రంపైన తమందరి పాద ధూళి దులిపి మూటగట్టి యిచ్చారు. "మీకు పాపం రాదా అమ్మా!" అని అడిగిన నారదునితో, "మాకు ఏ నరకమైనా రానివ్వు స్వామీ! ముందు మా కన్నయ్య బాధ తగ్గనీ" అన్నారు. ఆ మాట నారదుని ద్వారా విన్న కృష్ణుడు చిరునవ్వుతో లేచి కూర్చున్నాడు. అదీ ప్రేమ. ఎదుటివారి కష్టాల్ని తీర్చడానికి తాను నరకాగ్నిలో కూలడానికైనా సిద్ధమయ్యే సర్వశ్రేష్ఠమైన భావనే ప్రేమ.

మనం జన్మించినది మొదలు శైశవంలో తల్లిని ప్రేమిస్తాం. పెరుగుతూ తండ్రిని కూడా ప్రేమించటం ప్రారంభిస్తాం. మెల్లగా స్నేహితులకు, గురువులకు, భార్యాపిల్లలకు, బంధువులకు.... అలా పంచుతూ వెడతాం. అలా పంచుతూ, పంచుతూ పలచనవుతున్న ప్రేమలన్నిటినీ వెనక్కు తెచ్చి భగవంతుని పాదాల మీదనే స్థిరంగా నిలిపితే దాన్నే భక్తి అంటాము.

"సా త్వస్మిన్ పరమప్రేమ రూపా భక్తిర్మతా" అన్నారు నారద మహర్షి. అలాంటి సర్వశ్రేష్ఠమైన పరమప్రేమ హృదయం నిండా నింపుకొని భగవత్స్వరూపులే అయిన జీవులన్నిటికీ పంచగల శక్తి, ఔన్నత్యం శ్రీ సాయి రాములు అందరికీ అనుగ్రహింతురు గాక!





# వినతి

**- స్వర్గీయ శ్రీ మాణిక్యరాయ శర్మగారు**

బాలకుండైన ధృవుని జేపట్టినట్టి
యల్లనాటి నీ కృపకేమియాయెనిపుడు?
వృద్ధుడనటంచు నన్నిట్లు వీడనగునె!
భక్త హృదయాంతరంగ, శ్రీ పాండురంగ!

తాల్చినావట శిరమున దయను మున్ను
భక్త శ్రీ తుకారామునభంగములను
కాంచుమీ పద్యము క్రీగంటనైన
భక్త హృదయాంతరంగ, శ్రీ పాండురంగ!

తనర గోవిందయంచునిత్యంబునీదు
నామచింతన దక్కయన్య మెరుంగ
నట్టి నను నిరసింపగా నగునె నీకు
భక్త హృదయాంతరంగ, శ్రీ పాండురంగ!

ఎటులబోయెద మున్ను గజేంద్రునార్తి
బాపియున్నట్టి నీ దయ పరమపురుష,
నేను నీవాడనంచు నన్ గావ రావ!
భక్త హృదయాంతరంగ, శ్రీ పాండురంగ!

తప్పనే యెంతవారికీ ధరణిలోన
ననుభవింపక కర్మంబుననుదినంబు
పరమ కరుణాతరంగ, యోపాప భంగ
భక్త హృదయాంతరంగ, శ్రీ పాండురంగ!

పండితులు పెద్ద కవులు నీ పాదములను
భక్తిఁ గీర్తించుచుండ నా వలన నేమి
యగును, నాపైన నీ కృప తగునుగాని
భక్త హృదయాంతరంగ, శ్రీ పాండురంగ!

# మాతృసంస్థ కబుర్లు

డిసెంబరు 21వ తేదీ మార్గశిర శుద్ధ ఏకాదశి-గీతా జయంతి. అదే వైకుంఠ ఏకాదశి. ఆనాడు ముక్కోటి దేవతలూ భువికి దిగివస్తారని ప్రతీతి. అందుచేత భక్తులందరూ దేవాలయాలకు-ప్రధానంగా విష్ణ్వాలయాలకు వెళ్లి ఉత్తర ద్వారం గుండా దైవదర్శనం చేసుకొంటుంటారు. కోదండ రామ సాయి సన్నిధానం (సత్తెనపల్లి)లో కోదండరామస్వామి వారి దేవాలయం దాదాపు తొంభై ఏళ్లనాటిది గనుక అక్కడ యీ ఉత్సవం చాలా ఘనంగా జరుగుతుంది. డిసెంబరు 20వ తేదీ ఉదయం సాయిధామం నుండి రాంబాబు, ఆనందంగారు, చంద్రారెడ్డిగారు, నరేశ్, నరసింహ, రమేశ్, వంశీ మొదలైనవారంతా బయలుదేరి సత్తెనపల్లి వెళ్లారు. మధ్యాహ్నానికి చేరుకొన్నారు. రామకోటేశ్వర్రావుగారు, బ్రహ్మారెడ్డి అక్కడే ఉన్నారు. భోజనాదికాల తరువాత-కోదండరామయ్య వారి విగ్రహాలకు పులికాపు పెట్టటం మొదలు-భక్తుల రాకపోకలకు వీలుగా కర్రలు కట్టటం వరకు తలోపనీ అందుకొన్నారు. ఈ సంవత్సరం సాయి దేవాలయానికి క్రొత్తగా వచ్చి చేరిన సింహాసనాదికాల పని కూడా ఎక్కువైంది. శ్రీ ప్రేమ్‌కుమార్‌గారు ముందుగానే చాలాపనులు ఓ కొలిక్కి తెచ్చి ఉండటంతో పని త్వరగా పూర్తయింది. రాత్రి విశ్రాంతి.

వేకువజామునే లేచింది ఈ బృందం. గురుదేవులు సంకల్పించి, నిర్మాణానికి ముందే వదిలివెళ్లిన 'ప్రవేశద్వారం' దగ్గరకు వెళ్లారు అందరూ. గురుదేవుల పాదుకలు శిరస్సున ఉంచుకొన్నాడు రాంబాబు. వారి చిత్రపటం పట్టుకొన్నారు ఒకరు. శ్రీ సాయి సంస్మరణతో, గురునామ స్మరణతో కన్నీటి జడుల మధ్య రాంబాబు గేటు తెరిచి, లఘుపూజతో కొబ్బరికాయ కొట్టించాడు ఆనందంగారితో. తరువాత "గురుదేవా! లోపలికి వెడదాం రండి" అంటూ పాదుకలతో లోపలికి వెళ్లాడు. గురువుగారు





లేకపోయిరే అన్న దుఃఖం, వారు తలపెట్టిన పనిని పూర్తిచేసామన్న సంతృప్తి కలిసి నడిపాయి అందరినీ లోపలికి. అప్పటికి నాలుగున్నరవుతోంది.

కోదండ రామాలయంలోను, ఆనంద సాయి మందిరంలోను ఉత్తర ద్వారాలు తెరిచారు. రామాలయంలో పట్టుపీతాంబరాలతో, పుష్పమాలలతో సాలంకృతులైన సీతారామలక్ష్మణులు హనుమత్సమేతంగా కొలువైనారు ఉత్తరద్వారంలో. సాయినాథుల వారి ఉత్సవ విగ్రహం సాలంకృతమై కూర్చున్నది సాయి ఆలయంలో. భక్తప్రవాహం ప్రారంభమైంది. కొబ్బరి కాయలు, హారతులు, ప్రసాదాలు, నామసంకీర్తనలు, పిల్లల కేరింతలు-ఒకటే కోలాహలం పదకొండున్నర వరకు. అటుపైన ఉద్ధృతి కొంత తగ్గింది. మొత్తం మీద మూడున్నర వేలమంది దర్శనానికి వచ్చారని అంచనా. ప్రసాదాల ఏర్పాటుకు, తదితర విషయాలకు కూడా తమ సహాయ సహకారాలు అందించిన భక్తులందరికీ శ్రీ సాయిరక్ష.

మన వాళ్లంతా మధ్యాహ్న భోజనాలు చేసి, క్రిస్మస్ సెలవుల సందర్భంగా వచ్చిన భారతి, సుధసహా బయలుదేరి ఆశ్రమానికి వచ్చేసారు. సాయి ధామంలో 21వ తేదీన ఉత్తరద్వారం ద్వారా సాయిని దర్శించుకున్నారు భక్తులు. సాయినాథ క్షేత్రంలో కూడా అలాగే ఉత్తరద్వార దర్శనం జరిగింది.

డిసెంబరు 22వ తేదీ ఉదయం ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు ప॥పూ॥శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందగిరి స్వాములవారు ఆశ్రమానికి విచ్చేసి, ఆశ్రమవాసులను ఆశీర్వదించారు. (వారి బోధ వేరే పేజీల్లో ఉన్నది) ఆరోజు మధ్యాహ్నం అంకిరెడ్డిపల్లెలోని మళయాళ స్వామి ఆశ్రమంలో స్వామి వారికి తులా భార కార్యక్రమం ఉన్నదని ఆహ్వానం రాగా మాతాజీ, రాంబాబు, అమ్మలు అక్కడికి వెళ్లారు. అక్కడ స్వామివారి ఆజ్ఞపై మాతాజీ తమ గురుదేవుల పేరిట అక్కడి భక్తులతో కొద్దిసేపు ముచ్చటించారు. 'చిట్టి దెయ్యం' కథ చెప్పి మానవులు సత్కార్యాలు వాయిదా వేసుకొంటూ, దైవకార్యానికి రేపు రేపనుకొంటూ జీవితాలు గడిపేసి, ఎలా వ్యర్థం

చేసుకొంటారో వివరించగా- స్వామి వారు ఆనందంతో ఆశీర్వదించారు. అంకిరెడ్డిపల్లె ఆశ్రమాధిపతులు శ్రీశ్రీ సత్తెయ్యగారు మాతాజీని సన్మానించుకోగా-స్వామి వారు తమతోపాటు భోజనాలు చేసి వెళ్లవలసిందిగా ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆ విధంగా రోజంతా స్వామివారితో కలిసిఉండటం దుఃఖతప్తాలైన తమ హృదయాలకు కొంత సాంత్వన చేకూర్చింది.

డిసెంబరు 25వ తేదీ మార్గశిర శుద్ధ పూర్ణిమ- శ్రీ దత్త జయంతి. ఆ రోజు సాయిధామంలో శ్రీ సాయినాథ వ్రతం జరిగింది. దత్తాత్రేయ స్వామికి, సాయినాథులకు విశేషపూజలు జరిగాయి. డిసెంబరు 31వ తేదీ రాత్రి సాయినాథ వాసులు కూర్చొని గురుదేవులను, వారి మహాభినిష్క్రమణాన్ని స్మరించుకొన్నారు. వారు లేని నూతన సంవత్సరానికి స్వాగతం ఎలా పలకాలో తెలియక ఖిన్నులై కూర్చొని కన్నీళ్ల ఆరాక హారతిచ్చి నమస్కరించుకొన్నారు.

జనవరి 1వ తేదీన వందలాదిమంది భక్తులు శ్రీ సాయి దర్శనానికి వచ్చి ధన్యులైనారు. 4వ తేదీ సాయంత్రం రాంబాబు, చంద్రారెడ్డిగారు కలిసి గురుదేవుల పాలరాతి విగ్రహానికి ఆర్డరిచ్చేందుకై జయపూరు బయలుదేరి వెళ్లారు.



## శక్తి

- "మైత్రి" నుండి

1948- బాపూజీ కాలంలో కలిగిపోయారు. సేవాగ్రామ్‌లో అందరూ కూర్చొని ఉన్నారు. "ఇకముందేం చెయ్యాలి?" అందరి ముందూ అదే ప్రశ్న. బాబూ రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్‌నెహ్రూ, జయప్రకాశ్‌నారాయణ్, రాజాజీ, కృపలానీ వంటి హేమాహేమీలంతా ఉన్నారక్కడ. అందరూ వినోబాభావే వైపు చూచారు మార్గదర్శనం కోసం. ఆయన యిలా అన్నారు-





"మన ఆశ్రమం క్రింద ఉన్న వివిధ విభాగాలను కలిపివెయ్యండి. 'సర్వ సేవా సంఘం' తయారవుతుంది. ఎవరి శంఖం వారు ఊదుకోవడానికి బదులుగా అన్ని శంఖాలూ ఒక్కటిగా ఊదుదాం. అప్పుడు శక్తి ఉత్పన్నమవుతుంది. సుసంఘటితమైన సేవకుల శక్తి ఎన్నో చమత్కారాలు చేయగలదు. అందరూ ఏదో ఒక నిర్ణీత సమయంలో-వారానికా, నెలకా, రెండు నెలలకా అన్నది మీరు నిర్ణయించుకోండి. కేవలం మీ, మీ వ్యవస్థల కార్యక్రమాలు చర్చించుకోవడానికే కాదు-పరస్పరం మైత్రీ భావన, ప్రేమ పెరగడానికి కూడా యీ కలయిక ఎంతో తోడ్పడుతుంది. ఒకే మంచి ఆలోచనలున్న మనుష్యులు పదిమంది ఒకచోట చేరితే ఏం మాట్లాడుకుంటారు? సదాలోచనలే వస్తాయి గదా! అవి మరిన్ని సత్కార్యాలకు దారితీస్తాయి. ఎవరికైనా ఒక సందేహం వస్తే మరొకరు సమాధానమిచ్చే ప్రయత్నం చేస్తారు. దానివలన అడిగిన వారి సందేహం తీరడమే కాదు-చెప్పిన వారి చింతన బలపడుతుంది కూడా. ఇదంతా మేలే గదా! క్రమంగా యీ చర్చలు, యీ సమావేశాలు మైత్రీబంధాన్ని పెంచుతాయి. కలిసిన చేతులు ఎంత భారాన్నైనా మోయగలవు. అవి లోకకళ్యాణానికే దారితీస్తాయి" అన్నారు.

ఇది సాధకులందరికీ ఉపదేశమే. ఆ సత్సంగ శక్తిని మనమందరం పొందాలిగా మరి! అందుచేత మీ మీ నివాసప్రాంతాలలో మీలాంటి ఆధ్యాత్మిక భావాలున్న పదిమందిని చేర్చుకోండి. చిన్న సత్సంగం ఏర్పాటు చేసుకోండి. అక్కడ ఉత్పన్నమయ్యే శక్తిని సమాజసేవకై ఉపయోగించి ధన్యులు కండి. ఇది సాయిని చేరడానికి దగ్గరి దారి గదా!

# మనకుందా?

– శ్రీ ఎం.వి. మాధవరావు

సేవ చేయటం అనే మాట చాలా గ్లామరస్‌గా వినిపిస్తోంది ఈ మధ్య. గుళ్లో సేవకు వెడుతున్నాం అంటారు. తిరుపతిలో సేవకు, పుట్టపర్తిలో సేవకు, పుష్కరాల్లో సేవకు, దుర్గకొండ మీద సేవకు-ఇలా జనం చాలా మంది విభిన్న స్థలాలకు వెడుతూ ఉంటారు. పెద్దఎత్తున జరిగే ఉత్సవాలలో మంచినీళ్లో, మజ్జిగో, ఆలయం అందించే ప్రసాదాలో సక్రమంగా పంచటం, భక్తులను పంక్తులలో నిలబెట్టటం-యిలాంటి సేవలు అక్కడ చేస్తూ ఉంటారు. సామూహికంగా అందరూ కలిసి ఉత్సాహంతో త్రుళ్లుతూ చేసేవి గనుక అలాటి సేవలు ఆనందదాయకంగానే ఉంటాయి. అవి ఆయా సమయాలకు చాలా అవసరం. అయితే అలా ఎన్నిసార్లు చేయగలరు? సంవత్సరంలో కొన్నిసార్లు-ఉత్సవాలలో వగైరా సమయాల్లో... మరి మిగతా సమయాలలో?

ఆంగ్లంలో ఒక సూక్తి ఉంది. “Successful people don’t do great things. They do everything greatly” అని. ఎప్పుడో ఒకసారి యాదృచ్ఛికంగానో, ఉద్రేకం కలిగో, ఉద్దేశ్యపూర్వకంగానో ఒక ఘనకార్యం చేస్తారు కొందరు. వాళ్లు మంచి పనిచేసినట్లే. ఆ మేరకు గౌరవనీయులే. కానీ గొప్పవారు అనలేము. చేసిన ప్రతి పనినీ ఎంతో కౌశలంతో, నైపుణ్యంతో, పకడ్బందీగా చేసే వారినే గొప్పవారనాలి. అందుకు ఎంతో ప్రతిభ, చురుకుదనం ఉంటే చాలదు. స్థిరంగా, ధీమంతంగా నడవగల సాధన కావాలి. క్షణక్షణం తమ చర్యలను తామే పరిశీలించుకొని అంచనా కట్టుకోగల సంయమన శక్తి కావాలి. లక్ష్యం వైపు సాగే ప్రయాణంలో ప్రతి అడుగూ సమతూకంతో వేయగల స్థితప్రజ్ఞత్వం కావాలి. ఇవన్నీ సమకూర్చుకోగలవారే ‘మహనీయులు’ అని పిలవబడడానికి అర్హులవుతారు. కానీ నేడు కేవలం





ఆత్మ తృప్తి కోసం ఏదో సేవ చేసాం అనుకోగల సామాన్యులే ఎక్కువవుతున్నారు.

అందుచేత తాము చేసే ప్రతి పనినీ ఒక మహత్తర కర్తవ్యంగా భావించి, అదే ఒక దైవారాధనగా భావించి చెయ్యాలన్నది గీత. ఆ పనులు పరోప కార నిమిత్తమైనపుడు ఇక వాటి పవిత్రతను గూర్చి చెప్పేదేమున్నది? అలాటి పవిత్రకార్యాలవైపే సాధకుడు ఎప్పుడో ఒకసారి కాకుండా ఎల్లవేళలా చూపు సారిస్తూ ఉండాలి.

# వ్యాసాశ్రమ స్వామి వారితో....

డిసెంబరు 22వ తేదీనాడు ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందగిరి స్వాముల వారు సాయిధామం ఆశ్రమానికి వేంచేశారు. వారు నిరాడంబరులు, నిర్మల స్వభావులు, నిగర్వులున్నూ! గురుదేవులు దేహత్యాగం చేసిన సమయాన వారు చాతర్మాస్య దీక్షలో ఉండడం చేత రాలేకపోయినారు. తమ దివ్యాశీస్సులు అందించేందుకై యిప్పుడు వచ్చారు. గురుదేవులను ఎంతో అభిమా నించిన స్వామివారు ఆశ్రమవాసులతో గురుదేవులను గురించి, ఆశ్రమ సేవ రీతులను గురించి, సాధకులకు ఉండవలసిన పద్ధతుల గురించి సర్వసుందరమైన శైలిలో వివరించారు. ఆ విషయాలు పాఠకులతో పంచుకుంటున్నాం.

“శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు ఉత్తమ సాధువు. శాంతస్వరూ పులు. నిజానికి మహర్షుల కోవకు చెందినవారు. వారు ఏర్పరచిన ఆశ్రమం వారి స్వరూపమే. దేశం గురించీ, ధర్మం గురించి వారు ఎంతో చేయాలనుకున్నారు. వారిని కోల్పోవడం దుఃఖకారణమే అయినా కాలగతి

తప్పరానిది కదా! ప్రపంచంలోని చరాచర వస్తువులన్నింటిలోనూ భగవంతుడే నిండి ఉన్నాడు. అసలు భగవంతుడే ఇన్ని రూపాలతో సంచరిస్తున్నాడు. ఆ విషయాన్ని గుర్తించడమే సాధనకు లక్ష్యం. ఆశ్రమాలు అలాంటి సాధకుల కోసం ఏర్పడేవే. ఆశ్రమసేవ ఎంత అద్భుతమైందో, అద్భుత ఫలితాలను యిస్తుందో మనకు పుండరీక చరిత్రలో తెలుస్తుంది.

పుండరీకుడనే ఒక యువకుడు తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసి, తన యిష్టం వచ్చినట్లు తిరుగుతూ ఉండేవాడు. వారు తీర్థయాత్రలు చేస్తూ ఎదురుపడినా చూడనట్లే తప్పకునేవాడు. ఒకరోజు అతడు అలా అలా తిరుగుతూ ఒక ఋషి ఆశ్రమానికి చేరుకున్నాడు. అప్పటికే చీకటి పడటం చేత ఆశ్రమం వారి అనుమతితో అక్కడే విశ్రమించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత అతడికి మెలకువ వచ్చింది. ఆశ్రమంలోకి ముగ్గురు స్త్రీలు వచ్చారు. వారు పరమవికారంగా, మురికిగా ఉన్నారు. చెట్ల కింద ఉంచిన చీపుళ్లు తీసుకుని ఆశ్రమం మొత్తం శుభ్రంగా ఊడ్చేశారు వాళ్లు. పుండరీకుడు చూస్తూచూస్తూ ఉండగానే ఆ ముగ్గురు వికార స్వరూపులు పరిశుభ్రంగా మారిపోయి దివ్యదీధితులతో వెలిగిపోసాగారు.

పుండరీకుడు ఆశ్చర్యపడి వాళ్ల దగ్గరకు వెళ్లి నమస్కరించి "అమ్మా! మీరెవరు? మీ రూపాలు యిలా చటుక్కున మారిపోవడానికి కారణం ఏమిటి?" అని అడిగాడు. దానికి వారు "నాయనా! మేము గంగా, యమునా, సరస్వతీ నదులం. అనేకమంది అనునిత్యం మాలో స్నానాలు చేస్తూ ఉంటారు. వారి పాపాలు, దోషాలు మాలో కరిగి మాకు యీ వికృత రూపాలు వస్తుంటాయి. ఆ పాపనివారణ కోసం మేము ఆశ్రమం శుభ్రం చేశాం. ఆ సేవాపుణ్యం వలన మా నిజరూపాలు మాకు వచ్చాయి" అని చెప్పారు. దానితో పుండరీకుడిలో కొంత వివేకం జన్మించింది. అటుపైన అతను తెల్లవారాక ఋషిని ఆశ్రయించి కర్తవ్యం మరచిన వాడికి





మోక్షం ఉండదని తెలుసుకొని, మాతా పితృసేవ దీక్షతో చేసి, తత్ఫలితంగా పాండురంగ దర్శనం పొందాడు. అందుచేత మీరందరు ఆశ్రమాన్ని సేవించండి. దీని ద్వారా సమాజానికి మేలు కలిగేలాగా సహకరించండి".

అటుపైన శ్రీ స్వామివారు శ్రీ సాయి విద్యాధామం విద్యార్థులనుద్దేశించి యిలా చెప్పారు. "ఏదైనా తెలుసుకోవాలి, నేర్చుకోవాలి అనేవాళ్లకు ఏకాగ్రత ఉండాలి. మీరు కాకిని చూస్తారు కదా! అది వేకువనే లేస్తుంది. అది ఒక కంటితో ఒకవైపే చూస్తుంది తప్ప చంచలదృష్టి ఉండదు. దానికి ఆహారం దొరికినా ఒకటే తినదు. కావ్‌కావ్‌మని అరచి సాటి కాకులన్నిటిని పిలిచి కలిసి ఆరగిస్తుంది. విద్యార్థి యిలాంటి కాకదృష్టి, జాగరూకత, తనకు దొరికిన జ్ఞానాన్ని నలుగురితో పంచుకొనే ఐక్యభావన కలిగిఉండాలి. కొంగ తాను పట్టదలచిన చేపల కోసం ఒంటికాలిపైన మరీ నిలబడుతుంది. లక్ష్యం సిద్ధించేదాకా ఏకదీక్షతో అలాగే నిలబడి సాధిస్తుంది. కుక్క కళ్లు మూసి పడుకొని నిద్రపోతున్నట్లే ఉంటుంది. పోతుంది కూడా. కానీ ఏ చిన్న అలికిడికైనా సరే చటుక్కున కళ్లు తెరుస్తుంది. అంటే దాని మెదడు నిద్రపోవడం లేదన్నమాట. అంత చురుకుగా ఉంటుంది. ఏదైనా సాధించాలనుకున్న వారికి కాకదృష్టి, బక దీక్ష, శ్వాన(కుక్క) నిద్ర ఉండాలి తప్ప చంచలదృష్టి, అలసత్వం, మత్తు నిద్ర ఉండకూడదు.

"మీరంతా ఎంతో అదృష్టవంతులు. బాల్యంలోనే యిటువంటి ఆశ్రమంలో గురు సన్నిధానంలో ఉండగలిగారు. గురువులు చెప్పిన వానిని విని, అవగాహన చేసుకొని, ఆచరించి గొప్పవారు కావాలి. మీరు ఎంతవారైనా ఆశ్రమాన్ని మర్చిపోకూడదు. విదేశాలలో ఉంటూ స్వదేశానికి వచ్చినాసరే- మొదట ఆశ్రమానికి వచ్చి దైవదర్శనం, గురుదర్శనం చేసుకొని, అప్పుడు మీ యింటికి వెళ్లాలి. అంతేకాదు - మీరు ఆశ్రమం కీర్తిని, మన మాతృదేశ కీర్తిని కూడా పెంచే విధంగా తయారు కావాలి. అలా మీకు పరమాత్ముని ఆశీస్సులు లభించుగాక!"